క్లుప్తంగా

రోడ్డు సౌకర్యం కల్పించాలి



ఎమ్మెల్యేతో యువకులు

తాంసి: కరంజి(టి) పంచాయతీ పరిధిలోని రాజుల్‌వాడీ గిరిజన గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామ యువకులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కోరారు. శనివారం మండల కేంద్రంలోని బోథ్ ఎమ్మెల్యే నివాసంలో గ్రామ యువకులు ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. రోడ్డు లేక అవస్థలు పడుతున్నామన్నారు. వర్షాకాలంలో బురద రోడ్డు గుండా వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. గ్రామ యూత్ అధ్యక్షుడు దీపక్ కుమార్, రాము, రామక్రిష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ సభకు తరలిరండి

ఇంద్రవెల్లి: ఆదివాసీ ఉద్యమనేత, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు ఉయిక సంజీవ్ ఆకాల మరణం పొందిన సందర్భంగా డిసెంబర్ 1న ఆదివారం నిర్వహించే సంస్మరణ సభకు ఆదివాసీ నాయకులు తరలి రావాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పుర్క చిత్రు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమ నేత ఆకాల మరణం బాధకరమన్నారు. సంజీవ్‌కు నివాళులర్పించేందుకు ఉట్నూర్ కేంద్రంగా ఉన్న కుమురం భీం కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు రాందాస్, పృథ్వీరాజ్, జైరాం, మురారీ, పెందూర్ అంకుష్, గేడం భారత్ పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు చర్యలు



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి రాంబాబు

నార్నూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో కుష్ఠు నిర్మూలనకు చర్యలు చేపడుతామని పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందికి కుష్ఠు నిర్మూలన సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ జరిగే కుష్ఠు నిర్మూలన సర్వేపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. డిసెంబర్ 2 నుంచి 15 వరకు అన్ని గ్రామాల్లో కుష్ఠు లక్షణాలు ఉన్న వారిని గుర్తించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మి, హెచ్ఈ తులసీదాస్ రాథోడ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, వైద్య శక్తి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

బేల: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శనివారం మండల ఐకేపీ ఏపీఎం లంక రాజరెడ్డి ఉద్యోగ విరమణను మండల పద్మావతి సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏపీఎం రాజరెడ్డికి పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మావతి మండల సమాఖ్య అధ్యక్షురాలు గావుండే మంజుషా, సీసీలు, వీవోఏల సంఘం సభ్యులు పొల్కట్ సంజయ్, గంగాధర్, ప్రవీణ్, రాధ, అనిల్, నవీతారెడ్డి, లత, సుజాత పాల్గొన్నారు.

నిధులు మంజూరు

ఇచ్చోడ: మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న షాదీఖానా భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్ తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి నాయకత్వంలో షాదీఖానా భవనానికి నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని నిషాన్‌ఘాట్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఐదుగురు నిషాన్‌ఘాట్ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. పట్టుబడ్డ వారి నుంచి రూ.4900 నగదుతో పాటు పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ

కైలాస్‌నగర్: మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సిర్రా దేవేందర్ శనివారం పరామర్శించారు. కమిషనర్ మాతృమూర్తి దేవుబాయి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెరుగు చిరంజీవి, చిల్క దేవిదాస్, గేడం పొచ్చిరాం, చంద్రశేఖర్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు

లక్షలు ఖర్చు చేసినా చుక్క నీరివ్వలే

- ఇదేనా ఇంజినీరింగ్ అధికారుల పనితీరు
- మడిగెల వేలాన్ని ఎందుకు నిర్వహించడం లేదు
- మున్సిపల్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం



సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

కైలాస్‌నగర్: రెండు నెలల క్రితం జిల్లా కేంద్రంలోని ఫిల్టర్‌బెడ్‌లో రూ.28 లక్షల వ్యయంతో చేపట్టిన పైపులైన్ కనెక్టివిటీ పనులతో ప్రజలకు చుక్క నీరందించలేదు. పనులు ఫెయిలయ్యాయని చెబుతున్నారు. ఇదేనా ఇంజనీరింగ్ అధికారుల నైపుణ్యమంటూ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రూ.15 లక్షలతో మళ్లీ పనులు చేస్తున్నారు. ఇప్పుడైన కనెక్టివిటీ జరుగుతుందనే గ్యారంటీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. గతంలో చేపట్టిన పనులపై విచారణ జరిపించి అందుకు బాధ్యులపై వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చైర్మన్‌కు డీసెంట్ నోటీసు అందజేశారు. చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన శనివారం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. 8 ఎజెండా అంశాలతో సమావేశం నిర్వహించారు. ఆడిట్ శాఖ నిర్వహించే ఆడిట్ సామగ్రి, వసతుల కోసం రూ.1లక్ష మంజూరుకు అనుమతించాలంటూ ఎజెండాలో పొందుపర్చిన అంశంపై బీఆర్ఎస్ కౌన్సిలర్ అలాల్ అజయ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను గత పదిహేనేళ్లుగా కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్నానని ఇప్పటి వరకు లేని విధంగా ఆడిటింగ్‌కు రూ.లక్ష ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. దీనికి ఇతర సభ్యులు సైతం అభ్యంతరం తెలుపడంతో దాన్ని వాయిదా వేశారు. వార్డు నెంబర్ 47లో గల ఖాళీ స్థలాన్ని మహిళ శక్తి క్యాంటిన్‌కు కేటాయించాలని పేర్కొంటూ పొందుపర్చిన అంశాన్ని సైతం ఆయన తప్పుపట్టారు. స్థలం ఎంత విస్తీర్ణం ఉంది, ఏన్నేళ్లు లీజుకిస్తున్నారు, లీజు అద్దె ఎంత అనే వివరాలు లేకుండా కోట్లాది రూపాయల స్థలాన్ని ఎలా కేటాయిస్తారని అభ్యంతరం వ్యక్తం చేయడంతో దాన్ని వాయిదా వేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్ కలాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌ను ఇతర వాటికి ఎలా మళ్లించారని అందుకు సంబంధించి ఎమైనా ఉత్తర్వులున్నాయా అని ప్రశ్నించారు. తాము ఏదైనా పని కోసం అడిగితే నిబంధనల ప్రకారం కుదరని చెబుతూ.. మీకు అనుకూలంగా ఉంటే ఒకలా లేకుంటే మరోలా వ్యవహరిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను కొత్తవారికి అప్పగిస్తే వారికి ఇచ్చే సమయంలో ఎన్ని దీపాలు ఉన్నాయి, అందులో పనిచేసేవి ఎన్ని, పనిచేయనివి ఎన్ని అనే వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. కాంగ్రెస్ కౌన్సిలర్ బండారి సతీష్ మాట్లాడుతూ వీధి దీపాల నిర్వహణను కాంట్రాక్టర్ గతేడాది కాలంగా పట్టించుకోవడం లేదని, సామగ్రి సరఫరా చేయడం లేదంటున్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించేలా ఎలా రికార్డులు నమోదు చేస్తున్నారని ప్రశ్నించారు. మున్సిపల్ మడిగెలను గత మూడేళ్లుగా వేలం వేయకుండా పెండింగ్‌లో ఉంచడంతో కోట్ల రూపాయల ఆదాయం కోల్పోయామన్నారు. భుక్తాపూర్ కాలనీకి మిషన్ భగీరథ నీరు అందడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి కమిషనర్ తిరుపతి, డీఈ కార్తీక్, శానిటేషన్ సూపర్ వైజర్ సాజీద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ జోగు ప్రేమేందర్

కార్పొరేట్ వైద్యం కోసమే సీఎంఆర్ఎఫ్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: వివిధ కారణాలతో ఆస్పత్రుల పాలైన పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడం కోసమే సీఎంఆర్ఎఫ్ పథకం ఉద్దేశమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. వడూర్ గ్రామానికి చెందిన పి.భోజవ్వకు రూ.28,500, బుద్దికొండ గ్రామానికి చెందిన ఎ.సౌజన్యకు రూ.24వేల చెక్కులను శనివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ ఎంపీటీసీ పండరి, దేవేందర్ రెడ్డి, లక్ష్మణ్, సునీతరెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్‌ది అసమర్థ పాలన

నేరడిగొండ: రాష్ట్రంలో అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. పాఠశాలలోని వంట గదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన రెడ్డి సంఘ సభ్యులు శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం సమస్యలపై చర్చించారు.

‘రైతును రాజు చేయడమే లక్ష్యం’



సీఎం ప్రసంగాన్ని వింటున్న రైతులు



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

నేరడిగొండ: రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడే వసంత్ రావ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు పండుగలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు, విజయోత్సవాల్లో భాగంగా రైతు పండుగను విజయవంతం చేయాలని కోరారు. మూడు రోజుల పాటు గ్రామాల్లో రైతు పండుగ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి, ఏఈవోలు జైపాల్, సౌజన్య, మహేందర్, అపర్ణ, గజేందర్, శశికాంత్, శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్ రైతువేదికలో శనివారం రైతు పండుగ వేడుకలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు వీక్షించారు. రైతు పండగలో భాగంగా రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్‌లో రైతు పండుగ ముగింపులో భాగంగా ప్రసంగాన్ని రైతువేదికలో రైతులతో కలిసి అధికారులు వీక్షించారు. కార్యక్రమంలో ఏవో రవీందర్, ఏఈవో శివకుమార్, సుప్రియ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సహకార సంఘంలో శనివారం రైతు పండుగ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. సహకార సంఘం చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈవో రాథోడ్ ఈశ్వర్, సభ్యులు పాల్గొన్నారు.

బడుల బంద్ విజయవంతం

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలను నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైంది. విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి మూసి వేయించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేశ్ మాట్లాడుతూ.. ఫుడ్‌పాయిజన్ అయి విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ కారణంగా విద్యార్థి మృతిచెందిందని గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, యూఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు సక్కు, అల్తాఫ్, దత్తు, మారుతి పాల్గొన్నారు.

బోథ్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో బంద్ ఏఐఎస్ఎఫ్ నాయకులు బంద్ చేయించారు. ప్రభుత్వ పాఠశాలలో రెసిడెన్షియల్, హాస్టల్‌లో నాణ్యమైన ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్, ప్రేమ్, శ్రీకాంత్, సంతోష్, రాంప్రసాద్, ప్రకాష్, వినేష్ పాల్గొన్నారు



నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఘనంగా ఎమ్మెల్యే వివేక్ జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్‌రూరల్: చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలో జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల రమేశ్, బేర దేవన్న, ముల్కల రాజేశ్వర్, రాఘవేంద్ర, మొట్టె కిరణ్ కుమార్, మలపతి సుభాష్, సూరం భగవాండ్లు, మెట్టు ప్రహ్లద్, అశోక్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపిక

బేల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన కాంబ్లే ప్రేరణ ఇటీవల జిల్లా కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ‘పునరుద్ధరింప దగిన వనరులు’ అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించి, ఈనెల 3న ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైంది. శనివారం విద్యార్థి కాంబ్లే ప్రేరణను మండల విద్యాధికారి కోల నర్సింలు, గైడ్ టీచర్ సిహెచ్ నితిన్‌కుమార్‌లు అభినందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గోరే బేబితాయి, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

వధూవరుల పరిచయ వేదిక పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌రూరల్: డిసెంబర్ 8న మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మహోర్ తాలుకా వెంకటప్రభ లాన్స్ వాయి (బజార్)లో నిర్వహించే గౌడ కులస్తుల వధూవరుల పరిచయ వేదిక పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని గౌడ సంఘ భవనంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్. రమేశ్ చందర్‌గౌడ్, సిద్దివేణి అంజన్ గౌడ్, భూమాగౌడ్, పోతారం శ్రీనివాస్ గౌడ్, దొర నర్సాగౌడ్, విట్టల్ గౌడ్ పాల్గొన్నారు.

ఐదు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలోని నేరడిగొండ మండలంలోని శ్రీదర్శన జిన్నింగ్ ఫ్యాక్టరీలోని సీసీఐ కేంద్రాల్లో శనివారం నుంచి డిసెంబర్ 5వరకు ఐదు రోజుల పాటు పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బోథ్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిల్లుల్లో పత్తి నిల్వలు అధికంగా ఉన్నందున సీసీఐ అధికారులు నాలుగు రోజుల పాటు నిలిపివేయాలన్న సూచనల మేరకు కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరిగి డిసెంబర్ 6న కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

నార్నూర్: గాదిగూడ మండలంలోని పలు గిరిజన గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంఈవో మనోహర్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని గాదిగూడలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. ఉదయం 10:30 గంటలకు వచ్చి తిరిగి మూడు గంటలకే వెళ్లిపోతున్నారని మండిపడ్డారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బేసిక్ విద్యను అందించాల్సిన ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కనీసం విద్యార్థులకు ఓనమాలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి కుంరా సత్యపాల్, నాయకులు శంకర్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు భీంరావు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నార్నూర్: ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని హరి భక్త పారాయణ్ నారాయణ మహరాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయం నుంచి విజయ నగర్ కాలనీ వరకు ఆధ్యాత్మిక ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సామూహిక హనుమాన్ చాలీసా నిర్వహించారు. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, చౌహాన్ బిక్కు, యశ్వంత్ రావు, గజానంద్, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ భక్తులు

ఐటీడీఏను బలోపేతం చేయాలి

కైలాస్‌నగర్: భవిష్యత్ తరాలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏను మరింత బలోపేతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావ్ కోరారు. శనివారం గాంధీ భవన్ వేదికగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఆదివాసీ కాంగ్రెస్ విభాగం సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70, పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, రాష్ట్రంలో గిరిజనుల కోసం అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలుపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఆనంద్‌రావ్

సిరిచెల్మ ఆలయంలో హుజూరాబాద్ ఏసీపీ పూజలు

ఇచ్చోడ: మండంలోని సిరిచెల్మ మల్లికార్జున ఆలయంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ఉన్న విగ్రహాలు, విశిష్టత గురించి స్థానిక పూజరిని అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఏసీపీ దంపతులు

బాధ్యతాయుతంగా పనిచేయాలి

ఎదులాపురం: విధుల్లో బాధ్యతాయుతంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా పని చేయాలని డీఎస్పీ ఎస్.జీవన్‌రెడ్డి అన్నారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని జిల్లా కేటాయించబడిన సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లకు శనివారం జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విధులను సక్రమంగా చేపట్టాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. క్రిమినల్స్‌ను పట్టుకోవడంలో ప్రదర్శించాల్సిన నైపుణ్యాలు తదితరాలను వివరించారు. ఇందులో ఎస్బీ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

బోథ్: ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. మండల డీఎస్పీ అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్లను ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ప్రజలందరికీ కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యని అందించాలన్నారు. ప్రతీ గ్రామంలో ఆధునిక హాస్పిటల్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు వెంకటేశ్, కుందూరు సుధాకర్, బిక్కు రమేశ్, నరేందర్, నరేశ్, సోలంకి సుభాష్, కుందూరు శ్రీనివాస్, నక్క రజశేఖర్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు

50 వారాలకు చేరిన హనుమాన్ చాలీసా పారాయణం

బోథ్: సోనాల గ్రామంలోని రామాలయంలో హిందూ ధర్మ జాగరణ మండలి ఆధ్వర్యంలో గత సంవత్సరం ప్రారంభించిన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం శనివారంతో 50వ వారానికి చేరుకుంది. ప్రతీ శనివారం రాత్రి 7 గంటలకు రామాలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. 50 వారాలు పూర్తయిన సందర్భంగా హిందూ ధర్మజాగరణ మండలి సభ్యులు ఓస శ్రీనివాస్ హనుమాన్ చాలీసా పారాయణ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఆర్.మధుసూదన్, గౌరీ శ్రీధర్, హరీష్ కుమార్, రాజ్ కుమార్, ఈర్ల దీపక్, వెంకటరమణ, సందీప్, ఆలయ పూజారి పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి ఫాల్ సీజన్‌కు గాను మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు ముఖ్యమంత్రి విదేశీ (సీఎం ఓవర్సీస్) విద్యా పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్, డాక్టరల్ కోర్సులు కొనసాగించడానికి స్కాలర్ షిప్, ఆర్థిక సాయం గ్రాంట్ నిమిత్తం అర్హత గల మైనార్టీ విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ మార్కుల జాబితా, జీఆర్ఈ, జీఎంఏటీ పరీక్ష స్కోర్ కార్డు ఏదైనా ఒకటి అర్హత కలిగి ఉండాలన్నారు. కుల, ఆదాయ, నివాస, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ కాపీ, విదేశీ విశ్వ విద్యాలయంలో చేరినట్లు ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, ఫొటో స్కాన్ చేయాల్సి ఉంటుందన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

బజార్‌హత్నూర్: ఎస్సీ రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలోని కొంత మంది ఎమ్మెల్యేలు ధిక్కార స్వరం వినిపిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ ఫలాలను కొంత మంది అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్, వినయ్, అనిల్, సంజీవ్, నవీన్, సురేశ్, నరేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆరెల్లి మల్లేశ్ మాదిగ